## మున్నుడి

శ్రీ రామనామ సంకీర్తన అనగానే అన్నమయ్య పలుకులలో నుంచి తేనెలూరుతుంటాయి. ఈ కీర్తన ఈ మాటల్లో అతిశయోక్తి అవంతైనాలేదని నిరూపిస్తుంది. సురరక్షకుడు అసురదమనుడు అయిన ఈ రామచంద్రుడు నెలకొనియున్నది విజయనగరమున. ఈయన ఆదియైన దానికే అనాది అని కీర్తిస్తున్నారు. యోగీంద్రుల మానస సరోజములందు సంచరించు ఈ రాఘవుడు జానకీ మనోహరుడు. ఆర్తరక్షాదక్షుడైన ఈ దశరధనందనునిపై కీర్తన వీనులకు విందైన కానడరాగంలో వినిపించారు. ఎప్పటివలెనె ఈ శ్రీ రాముడే నేటి శ్రీ వేంకటేశ్వరుడు అంటున్నారు అన్నమయ్య

**చం॥ ఇన కుల సోముడైన ఘనునీ రఘురాముని జానకీపతిన్**
**జనులను కన్నబిడ్డలుగ చక్కగనేలిన చక్రవర్తినిన్**
**మనులకు కన్న తల్లియగు మంగకునాధుడు వేంకటేశుగా**
**మనసున నెంచి అన్నమయ పాడెను 'కానడ' రాగమందునన్.**

**రాగం : కానడ**

రాముడు రాఘవుడు రవికులుడితడు
భూమిజకు పతియైన పురుష నిధానము ॥రాముడు॥

అరయ పుత్రకామేష్టి యందు పరమాన్నమున
పరగ జనించిన పరబ్రహ్మము
సురుల రక్షింపగ అసురుల శిక్షింపగ
తిరమై ఉదయించిన దివ్యతేజము ॥రాముడు॥

చింతించే యోగీంద్రుల చిత్తసరోజములలో
సంతతము నిలిచిన సాకారము
వింతలుగా మునులెల్ల వెదకినయట్టి
కాంతుల చెన్ను మీరిన కైవల్య పదము ॥రాముడు॥

వేదవేదాంతముల యందు విజ్ఞాన శాస్త్రములందు
పాదుకాన పలికేటి పరమార్థము
పోదితో శ్రీ వేంకటాద్రి బొంచి విజయనగరాన
ఆదికి అనాదియైన అర్చావతారము. ॥రాముడు॥

## భావామృతం

ఈ శ్రీ రామచంద్రమూర్తి రఘువంశమునకు చెందినవాడు. ఈయన రవికులమునకే శోభాయమైనవాడు. ధరణీనందనయైన సీతాదేవికి భర్తయైన ఈతడు పురుషులలో మూలధనము ( నిధానము) వంటివాడు.

దశరథమహారాజు పుత్రకామేష్టియాగము చేయగా ప్రీతిచెంది యజ్ఞపురుషుడిచ్చిన పరమాన్నము వలన జన్మించిన పరబ్రహ్మస్వరూపుడే ఈ శ్రీ రాముడు. ఆయన దేవతలందరికి రక్షకుడు. రాక్షసులను వధించెడివాడు. ఆయన స్థిరముగా పొడజూపిన దివ్యతేజస్సు.

ఈ దాశరథి తననే ధ్యానించు యోగీశ్వరుల మనోసరోజములందు ఎల్లప్పుడు సాకారముగా నిలిచేవాడు. మునీశ్వరులందరు వెదకులాడే కాంతివంతమైన మోక్షమార్గము ఈ శ్రీ రామచంద్రమూర్తి.

వేదములయందు, వేదాంతములందు, విజ్ఞానశాస్త్రమునందు ప్రధానముగా ఎఱుక పరచబడిన పరమార్థము ఈ శ్రీ రాముడే. ఒద్దికతో శ్రీ వేంకటేశ్వరునిగా వేంకటాద్రిపై వెలసిన ఈ స్వామియే విజయనగరమున ఆదియనుదానికే అనాదియైన అర్చావతార మూర్తిగా శ్రీ రామచంద్రమూర్తియై వెలసియున్నాడు.

## పాడి

రాముఁడు రాఘవుఁడు రవికులుఁ డితఁడు
భూమిజకుఁ బతియైన పురుషనిధానము ॥పల్లవి॥

అరయఁ బుత్రకామేష్టియందుఁ బరమాన్నమున
పరగ జనించిన పరబ్రహ్మము
సురల రక్షింపఁగ నసురల ^ శిక్షింపఁగ
తిరమై యుదయించినదివ్యతేజము ॥రాము॥

చింతించేయోగీంద్రులచిత్తసరోజములలో
సంతతమునిలిచినసాకారము
వింతలుగా మనులెల్ల వెదకి కనేయట్టి-
కాంతులఁ జెన్నుమీరినకైవల్యపదము ॥రాము॥

వేదవేదాంతములందు విజ్ఞానశాస్త్రములందు
పాదుకొనఁ బలికేటి పరమార్థము
పోదితో శ్రీవేంకటాద్రిఁ బొంచి విజనగరాన
ఆదికి సనాదియైనఅర్చావతారము ॥రాము॥ 

Scanned with CamSca